ప్రజాశక్తి
శుక్రవారం 19 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



లాటరీ విధానం ద్వారా బార్లు కేటాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఓపెన్ కేటగిరిలో బార్లను లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయించినట్లు కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బార్ కేటాయింపు ప్రక్రియ కలెక్టర్ ఛాంబరులో గురువారం జరిగింది. బార్ కేటాయింపుల కోసం నాలుగు దరఖాస్తులు అందగా, అందరికీ నెంబర్లను కేటాయిస్తూ కలెక్టర్ లాటరీని స్వయంగా తీసి చూపించారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.20.4 లక్షలు వచ్చినట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారి శాఖ పర్యవేక్షకులు బి.జీవన్ కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో సహాయ మద్య నిషేధ, అబ్కారి శాఖ పర్యవేక్షకులు ఎ.సంతోష్, ఇన్‌స్పెక్టర్ వివివిఎస్ శేఖర్ బాబు, ఎస్‌హెచ్‌ఒ జి.దాసు, మద్య నిషేధ, అబ్కారి శాఖ సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల మెడపై డిఎస్‌సి కత్తి

- గిరిజన గురుకులాల్లో 1143మంది భవిష్యత్తు ప్రశ్నార్థకం
- బితుకు బితుకుమంటున్న బతుకులు
- 15ఏళ్ళ పైబడి పని చేసినా కనికరం లేని సర్కార్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లు బితుకు బితుకుమంటూ బతుకుతున్నారు. మెగా డిఎస్సీ ఫలితాలు విడుదల కావడంతో వారిలో ఆందోళన తీవ్రమైంది. ఎంపికైన ఉపాధ్యాయుల నియామక ఉత్తర్వులు జారీ చేయడానికి రంగం సిద్ధమైంది. దీంతో రాష్ట్రంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న 1143 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 15 నుంచి 20 ఏళ్ల వరకు పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి కనిపిస్తోంది. చాలీచాలని జీతాలతో ఇన్నాళ్లు నెట్టుకొస్తున్న వీరి జీవితాలు అంధకారంలోకి వెళ్తాయని తెలిసి భయాందోళనలో ఉన్నారు. పిల్లా పాపలతో వున్న వీరు మరో ఉద్యోగం వెతుక్కోడానికి కూడా వయసు మీరి పోయింది. కొంత మంది ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు. తమ ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించాలని కోరుతూ వీరు రాష్ట్ర వ్యాప్తంగా గత డిసెంబర్ 24 నుంచి నిరసన దీక్షలు చేపట్టారు. ఇందుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో సహా ఎమ్మెల్యేలందర్నీ కలిశారు. ఏ ఒక్కరూ స్పష్టమైన హామీ ఇవ్వలేదు. 43రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేసినా పాలకులు కనికరించలేదు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తిరిగి విధుల్లోకి చేరారు. మీ ఉద్యోగాలకు ఢోకా ఉండదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పినా, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల్లో 80శాతం మంది గిరిజనులే వున్నారు. రాష్ట్రంలో ఐదుగురు టిడిపి కూటమి ఎమ్మెల్యేలు గిరిజనులే వున్నారు. మన్యం జిల్లాలో ముగ్గురు గిరిజన ఎమ్మెల్యే లు వున్నారు. వీరెవరూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల భవిష్యత్తు గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోతున్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి కూటమి పార్టీలు వీరి ఆశలపై నీళ్లు చల్లాయి.



అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న రెడ్డి వేణి (ఫైల్)

గొడ్డు చాకిరీ చేయించుకున్న తర్వాత

ఓడ దాటిన తర్వాత బోడి మల్లయ్య చందంగా గత 15ఏళ్లుగా ప్రభుత్వాలు గిరిజన గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో గొడ్డు చాకిరీ చేయించుకున్నాయి. ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా తొలగించడానికి సిద్ధమవుతోంది. ఎన్నో ఆశలతో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడిగా గిరిజన గురుకుల పాఠశాలల్లో చేరి అదే భవిష్యత్తు అనుకొని అంకితభావంతో పని చేస్తున్న వీరిని దిక్కుతోచని స్థితిలోకి పాలకులు నెట్టారు.

తొలగింపు ఆలోచన మానుకోవాలి

గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల తొలగింపు ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి. 15 నుంచి 20 ఏళ్ల పాటు పనిచేసిన వారిని తొలగించడం అన్యాయం. వారు మరో ఉద్యోగానికి పనికిరారు. డిఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో వీరి పోస్టులను భర్తీ చేస్తే కుటుంబాలతో సహా రోడ్డున పడతారు.

పి.రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

మంత్రి హామీ నిలబెట్టుకోవాలి

గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డిఎస్సీ నుంచి మినహాయించాలని కోరుతూ డిసెంబర్ 24 నుంచి నిరసన దీక్షలు చేపట్టాం. అదే సమయంలో మంత్రి సంధ్యారాణిని కలిసి సమస్యల్ని వివరించాం. మా ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని సంధ్యారాణి హామీ ఇచ్చారు. ఆమె ఇచ్చిన హామీ మేరకు మేం నిరసన దీక్షలు విరమించి విధుల్లో చేరారు. అర్ధాంతరంగా మమ్మల్ని తొలగిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. ఇదే ఆధారం అనుకుని అంకితభావంతో పని చేశాం.

నిమ్మక దివాకర్, అధ్యక్షులు, గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల యూనియన్

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా, ర్యాలీ



సాలూరులో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు అనుబంధ సంఘం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ పకీరురాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా, పట్టణ అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకర్రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తుందని, గత ప్రతిపక్షంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు పూర్తిగా దాన్ని విస్మరించిందని విమర్శించారు. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికీ పిఆర్‌సి జీతాలు చెల్లించాలని, గత జులై సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, మరణించిన, అనారోగ్యం, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కుటుంబ పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎన్ఎంఆర్ బదిలీ కోవిడ్ క్లాప్ డ్రైవర్లకు రూ. 21వేలు జీతం చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై పలుమార్లు మున్సిపల్ ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టరుకు విన్నవించుకోవడం జరిగిందని, అయినా సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వ చర్యలు లేవని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఫెడరేషన్ నాయకులు మామిడి శివ, బంగారు రాజేష్, బంగారు రవి, పి.సంతోష్, మామిడి శ్రీను, ఎన్.శివ, పాపమ్మ, ఇప్పలమ్మ, మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు : రాష్ట్రంలోని మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా బోస్ బొమ్మ జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శంకర్రావు టి.రవి, కోశాధికారి రాముడు, మీడియా ఇంచార్జ్ శ్రీను మహిళా కన్వీనర్ స్వప్న మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలిరాజు, వెంకన్న, మధుమోహన్, పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు వెంకట్రావు, భోగిసు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ : సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన చేపట్టారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపాల్టీల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచకుండా పనిచేస్తున్నా కార్మికులపై అదనపు భారం మోపుతున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 14 నెలలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 23న విజయవాడలో జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నిరసన అనంతరం నగర పంచాయతీ కమిషనర్ రత్నం రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ సంజీవి, పి.వేణు, సిహెచ్ సురేష్, శ్రీదేవి, పి.విమల, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

డోలీ మోతలు తప్పేలా రోడ్డు సౌకర్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో డోలీ మోతలు తప్పేలా రహదారి సౌకర్యం లేని గ్రామాలకు రహదారులు కల్పించాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. ఇప్పటికీ డోలీ మోతలు ఉండడం బాధాకరమని, అటువంటి వాటికి స్వస్తి పలకాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన ప్రాంతాల్లో రహదారుల సౌకర్యంపై జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గల కొమరాడ, పాచిపెంట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని, సీతంపేట, జియ్యమ్మవలస మండలాల్లో 264 గ్రామాలను గుర్తించామన్నారు. వీటికి ప్రాధాన్యతను ఇస్తూ ఇంజినీరింగ్ అధికారులు వీలైనంత త్వరగా రహదారి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా రహదారి సౌకర్యం లేని గ్రామాలకు రోడ్లు కల్పించుకునే వెసులుబాటు ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో కనీస రహదారి సౌకర్యం కూడా లేని గ్రామాలు ఉన్నాయని, వాటిని గుర్తించేందుకు బృందాలను వేశామన్నారు. అందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి డోలీ మోతలు లేకుండా రహదారి సౌకర్యం కల్పించాల్సిన 264 గ్రామాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి రోడ్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి లక్ష్య సాధనకు కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఆర్ అండ్ బి, ఐసిడిఎస్, విద్య, విద్యుత్, మున్సిపాలిటీలు తదితర శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో బహుళ పంటల దిశగా ఆలోచన చేయాలని, తద్వారా రైతులు అధిక ఆదాయం పొందాలని సూచించారు. జిల్లాలో ఈ-పంట నమోదు శత శాతం జరగాలని, నమోదు వలన రైతులకు జరిగే మేలుపై అవగాహన కల్పించాలని అన్నారు. భూసార పరీక్షలు ప్రతి రైతు పొలంలో కూడా చేయాలని, ఇందుకు తగిన విధంగా ల్యాబ్ లు ఉండాలని పేర్కొన్నారు. రబీలో పంటలను ప్రోత్సాహించాలని సూచించారు. ప్రతి రైతుకు డ్రోన్స్ మీద అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేపీఐ శత శాతం ఆన్ లైన్ నందు నమోదు కావాలని, ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. అటవీ సంపద పెరగాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పశు సంపద మరింత వృద్ధి ఉండాలని తెలిపారు. పిల్లల్లో వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండేలా చర్యలు చేపట్టాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే మిగిలిన శాఖల వారికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతిని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, టి.సంతోష్ కుమార్, ఎవి సాల్మన్‌రాజు, డా. ఎస్.మన్మధరావు, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చామంతి ఎంపిక

సీతంపేట : మండలంలోని చాపరాయిగూడకు చెందిన బిడ్డిక చామంతి జు-జుట్స్ కరాటే పోటీల్లో మహిళా విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమె గుడిలోవలో గల విజ్ఞాన విహార్‌లోని అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ జూనియర్ కాలేజీ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 10 నుంచి ఉత్తర ప్రదేశ్‌లోని షహన్పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఈమె హాజరు కానున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగించాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఉపాధ్యాయులకు సూచించారు.. గురువారం ఆయన స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల, శంభాం బాలుర ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మెనూ గురించి తెలుసుకున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించి, వారి ఉపయోగాన్ని విద్యార్థినిలకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు వసంత లక్ష్మి, సుందరరావు, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం పర్యాటక ప్రాంతమైన ఆడలి వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యూ పాయింట్ చాలా బాగుందని, దీన్ని మరింత అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. వ్యూ పాయింట్ రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో డిఇ నాగభూషణ్, డిపిఒ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను తిలకిస్తున్న పిఒ పవర్ స్వప్నల్ జగన్నాథ్



ర్యాలీ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ప్రజా భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ బాబురావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పోస్టల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భావితరాలకు పర్యావరణ పరిరక్షణ అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని అన్నారు.

పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి పక్కనే ఉన్న పంట పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, కేసలి, కొటికి పెంట రైతులు నిరసన తెలిపారు. రైతుల రాకపోకలకు సర్వీస్ రోడ్డు వేయాలని, గ్రీన్‌ఫీల్డ్ రహదారికి వేసిన సైడ్ వాల్‌లను తొలగించాలని కోరారు. ఈ మేరకు నేషనల్ హైవే సమీపంలో ఉన్న రహదారి వద్ద పై రెండు గ్రామాల రైతులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులు చిన్న చిన్న నిబంధనలకు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా సైడ్ వాల్ నిర్మాణం చేపట్టి రైతులను పంట పొలాలకు వెళ్లే మార్గాలను బ్లాక్ చేసి పొలాలకు వెళ్లనీయకుండా దిగ్బంధించేలా మార్గం లేకుండా చేయడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేసిన సైడ్ వాల్‌లను తొలగించి సర్వీస్ రోడ్ వేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని సేవలో మునిగిపోయి రైతుల సమస్యలు విస్మరించాయని విమర్శించారు. దాదాపు హైవే పక్కన ఉన్నటువంటి రైతులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో దేశానికి అన్నం పెట్టే రైతును అన్ని విధాలా ఆదుకొనేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్.నర్సింగరావు, రాపాక అప్పారావు, కొటికి పెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, జెడ్‌పిటిసి మాజీప్రతినిధి సలాది అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులతో పాటు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత : సిడిపిఒ

ప్రజాశక్తి - మక్కువ

బాలల హక్కులను పరిరక్షించడంలోనూ, బాల్యవివాహాలను అరికట్టడంలో సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకోవాలని సిడిపిఒ బి.అనంతలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మిషన్ వాత్సల్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలల సంరక్షణ, హక్కులకు భంగం కలగకుండా ఏర్పాటు చేసిన 11 మంది కమిటీలో సర్పంచ్ చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. మిషన్ వాత్సల్య అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18ఏళ్లు నిండి వరకు వారిని సంరక్షిస్తామని, అనాథలైన బాలలకు శిశు గృహం ద్వారా వారి బాగోగులు చూసుకుంటామన్నారు. ఎంపిడిఒ అర్జునరావు మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పనిచేసినట్లయితే బాల్యవివాహాలు అరికట్టడం సులభతరమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరూ ముందుకు సాగాలన్నారు. డిసిపిఒ సత్యనారాయణ బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే నష్టాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు సర్పంచులు పాల్గొన్నారు.

ఎవరూ రావొద్దు

టిడిపి సమావేశానికి నోఎంట్రీ

ప్రజాశక్తి -పాలకొండ

నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో బాహాటంగానే గ్రూపురాజకీయాలు పెచ్చుమీరుతున్నాయి. నేతల మధ్య సఖ్యత లేకపోవడం ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరుతో మొదటి నుంచి ఇక్కడ గ్రూపులు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఏ సమావేశం జరిగినా తెలుగు తమ్ముళ్ల రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తుంది. కార్యకర్తలు కూడా దీనిపై తీవ్ర అసంతృప్తి చెందే పరిస్థితి కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల, పట్టణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోకి మీడియాతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారులెవర్నీ లోపలికి అనుమతించలేదు. దీంతో అసలు లోపల తెలుగు తమ్ముళ్ల ఏం చర్చించుకున్నారనేది ప్రతి ఒక్కరూలోనూ అనుమానాలు రేకెత్తుతున్నాయి.

స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛంధంగానే బంగారు కుటుంబాల దత్తత ఉంటుందని, మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని జాయింట్ కలెక్టర్ సి యస్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ పి4 బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెసి మాట్లాడారు. బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులు ముందుకు రావాలని కోరారు. ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదని, స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రావచ్చని పేర్కొన్నారు. అలాంటి వారినే మార్గదర్శిగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మార్గదర్శులకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి జెసి సూచించారు. అనంతరం సిబ్బందికి కలిగిన అనుమానాలను జేసీ నివృత్తి చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో జిల్లా ప్రణాళికాధికారి ఎస్.ఎస్.ఆర్.కె. పట్నాయక్, స్టాటిస్టికల్ రాష్ట్ర పరిశీలకులు లతీఫ్, రాష్ట్ర శిక్షకులు శ్రీనివాస్, జిల్లా ప్రణాళికా కార్యాలయ సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లాలోని సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.శ్రీనివాస ఆచారి కోరారు. ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఈనెల 28లోగా తమ నమోదు యునిక్ నెంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐ నందైనా తనిఖీ (ధ్రువీకరణ) చేయించుకొని ఆమోదం పొందాలన్నారు. అలా చేయబడిన వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్టులో నమోదవుతాయన్నారు. కావున సదరు వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఐటిఐలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ఈనెల 29న జరుగు అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావల్సిందిగా కోరారు. మొదటి మూడు విడతల్లో సీట్లు దక్కకపోయిన వారు, లేదా దక్కిన సీటును ధ్రువీకరించుకోని విద్యార్థులు ఈ నాలుగో విడత ద్వారా మళ్లీ అవకాశం పొందే అవకాశం ఉందని, గడువు తీరిన తర్వాత ఎటువంటి దరఖాస్తులు పరిగణించబడవని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ అర్హతలు, కోర్సు ఆసక్తి, భవిష్యత్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సక్రమమైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిన సీట్ల కోసం అవసరమైతే మరో విడత ప్రకటించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -సీతానగరం

అనకాపల్లి జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయి ఆర్చర్ మార్షల్ హాట్ రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి తెలిపారు. అండర్ 14, 15 విభాగాల్లో ఆకుల సామత్, పలగర రంజిత్, బొంగు భానుప్రసాద్, సింగరాయ గౌరీశంకర్ జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు బోన చిట్టిబాబును ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సుస్థిత అభివృద్ధి లక్ష్యాలు, పంచాయతీ స్థాయిలో అభివృద్ధి ఏ విధంగా సాధించాలి, పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని, విద్య, ఆరోగ్యం, తాగునీరు, బాల సంరక్షణ, రహదారులు, కాలువలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, గృహ నిర్మాణ శాఖ ఎఇ వి.వినోద్ కుమార్, ఎపిఒ జి.సత్యంనాయుడు, ట్రాన్స్‌కో ఎఇ సోమేశ్వరరావు, ఎంఒ టి.బంగారుబాబు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ కోత

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక 11కెవి ఫీడర్ నందు చెట్లు కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్‌శాఖ ఎఇ పి.శశిభూషణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతానగరం సబ్ స్టేషన్ పరిధిలో సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, కొత్తవలస, బూర్జ సబ్‌స్టేషన్ పరిధిలో బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం, చిన అంకలాం, సుమిత్రపురం, కామన్నదొరవలస,గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా కోరారు.

గిరిజన గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆది కర్మయోగి అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలు శాతం అభివద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని దేవుకొన, పూర్ణపాడు గ్రామాల్లో గురువారం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందుగా వీధుల్లో ర్యాలీ చేసి, గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభలో మండల అధికారుల బృందం గుర్తించిన వివిధ పనులను రోడ్లు, కాలువలు, ప్రహరీ గోడలు, శ్మశాన వాటికలు, ఇళ్ల నిర్మాణాలు, పింఛన్లు తదితరమైన పనులను చదివి వినిపించారు. ఇంకా పెండింగ్ విషయాలుపై చర్చించారు. కార్యక్రమంలో సిడిపిఒ జి.సుగుణకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శారదంబ, సర్పంచ్ విజయలక్ష్మి, సిబ్బంది, ఎన్జీవో సంఘ సభ్యులు నాయకులు హిమరక గోపి, గండి మోహనరావు, దొర బాబు, ఉద్యోగులు ఉన్నారు.

పోషకాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - కొమరాడ

జీవితంలో ప్రతి దశలోనూ తప్పనిసరిగా పోషకాహారం ఉండాలని ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి.సుగుణ కుమారి అన్నారు. మండలంలోని దేవుకోనలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ మహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతలు చేసి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ప్రతి దశలో పోషకాహారం గురించి విస్తృత అవగాహన పెంపొందించడానికి, దీన్ని ప్రతి ఏటా పోషణ్ మాహ్ (సెప్టెంబర్ 1 నుండి 30 వరకు), పోషణ్ పఖ్వాడా (మార్చి పక్షం)గా నిర్వహిస్తామని తెలిపారు. 7వ రాష్ట్రీయ పోషణ్ మాహ్‌లో భాగంగా, వివిధ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపిడిఒ ఎస్.రమేష్, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, సూపర్వైజర్ శారదాంబ, నాయకులు గోపి, దొరబాబు, గండి మోహనరావు ,సిబ్బంది గర్భిణీలు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి- పార్వతీపురం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ తల్లి సుర్ల సావిత్రి అనారోగ్య కారణంగా బుధవారం రాత్రి మృతి చెందారు. సీతానగరం మండలం పాపమ్మవలస గ్రామానికి చెందిన సుర్ల కృష్ణ, భార్య సావిత్రి సర్పంచ్‌గా పని చేశారు. వీరికి నలుగురు సంతానంలో మురళీమోహన్ చిన్న కుమారుడు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉద్యమ నాయకునిగా ఎదిగారు. మురళీమోహన్ తల్లి సావిత్రి అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం వారి స్వగ్రామంలో నిర్వహించారు. పలు ప్రజా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కలిసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జట్టు ఆశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చేసే పనిలో నిర్భయత్వం, ఆలోచనలో సానుకూలత, మన కాళ్లపై మనం నిలబడగలమనే ఆత్మవిశ్వాసం ఉంటే అభివృద్ధి సాధించినట్లేనని జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ విద్యార్థులకు హితబోధ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు జట్టు ఆశ్రమాన్ని గురువారం సందర్శించారు. ఎన్ఎస్ఎస్ పిఒలు రామయ్య, శ్రీవాణి ఆధ్వర్యాన విద్యార్థులకు జట్టు ఆశ్రమంలో కొనసాగుతున్న ప్రాజెక్టులను వివరించారు. జట్టు ఆశ్రమ సిఇఒలు వేస్ట్ మానేజ్మెంట్ రీసైక్లింగ్ ఎలా చేయిస్తారో వివరించారు. బయో గ్యాస్ ఉత్పదన మొదలైన ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణను విద్యార్థులు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆశ్రమంలోని పిచ్చిమొక్కలను తొలగించి, వాతావరణం శుభ్రం చేశారు.

రూ 85.80లక్షలతో మంచినీటి పథకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పివిటిజి 6 గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా రూ.85.80 లక్షలతో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం జెఇ డి.కావ్యశ్రీ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బట్టిగూడలో రూ.15.40లక్షలు, చినగోర కాలనీలో రూ.15.40 లక్షలు, గాదిలంకలో రూ.13.20 లక్షలు, మూలలంకలో రూ.13.20లక్షలు, సింధూనగరంలో రూ.13.20 లక్షలు, అచ్చపువలసలో రూ.15.40 లక్షలతో రక్షిత మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఆర్‌సిఎం ప్రాంగణంలో గల బోర్డు స్కూల్ (ఎంపి ఎలిమెంటరీ స్కూల్) చదివి అకాడమిక్, మంచి ప్రతిభ సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. సీతానగరంకు చెందిన మాజీసర్పంచ్ లంక రాములు జ్ఞాపకార్థం అతని భార్య లంక లక్ష్మీ, కుమారులు లంక శ్రీనివాసరావు, లంక రమేష్, విశ్రాంత పిఇఒ సుంకరి అప్పారావు ఈ నగదు బహుమతులను అందజేశారు. పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ వేయి రూపాయలు చొప్పున మూడు వేల రూపాయలు అందజేశారు. ప్రతిఏటా అందజేస్తామని శ్రీనివాసరావు, రమేష్ లుతెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తమ పాఠశాలలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు లంక కుటుంబ సభ్యులు నగదు బహుమతులు అందజేయడం పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ సాగు..లాభాలు బాగు

◆తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ◆రసాయనిక ఎరువు లేని పంటలపై ఆసక్తి చూపుతున్న గిరిజనులు ◆జిల్లాలో 69106.30 ఎకరాల్లో ప్రకృతి వరి సాగు

పుట్టుకతోనే అంతు పట్టని అనేక వ్యాధులు వెంటాడుతున్న ఈ రోజుల్లో కలుషితమవుతున్న ఆహార సంపదలను, సంప్రదాయ ప్రకృతి సేంద్రియ పంటలుగా మలుచుకునే భాద్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణంలో మార్పులు, కలుషిత ఆహారం వల్ల మనిషి రోగాల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. బిపి, షుగర్ అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా తర్వాత చాలామంది ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కువ శాతం రసాయనిక ఎరువులు లేని స్వచ్ఛ మైన ఆహారంతో పాటు చిరుధాన్యాలపైన ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జట్టు సంస్థ సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో 69106.30 ఎకరాల్లో 39,847 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. 8,350 ఎకరాల్లో 4,242 మంది రైతులు జొన్న పంట పండిస్తున్నారు. 8,985 మంది రైతులు 12,462 ఎకరాల్లో పత్తి, 22,316 మంది రైతులు 62199.60 ఎకరాల్లో జీడి పంటలు పండిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో 8,532 మంది గిరిజన రైతులు 5,964 ఎకరాల్లో ప్రకృతి వరిసాగు, 65 మంది


కూరగాయలు సాగు చేస్తున్న భాగ్యలక్ష్మి

రైతులు 176 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. కురుపాం మండలంలో 7,612 మంది గిరిజన రైతులు 6,320 ఎకరాల్లో వరి, 210 మంది రైతులు 86.50 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు, జియమ్మవలస మండలంలో 3,820 మంది రైతులు 2,245 ఎకరాల విస్తీర్ణంలో వరి, 112 ఎకరాల విస్తీర్ణంలో 245 మంది రైతులు కూరగాయలు సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రసాయనిక ఎరువులు వాడకం లేని ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కార్బన్ శాతం పెంచడం వల్ల భూ తాపం తగ్గించడానికి వీలుంటుంది. రైతులు శ్రీవరి, శ్రీరాగి పంటలతో పాటు అంతర పంటగా వేరుసెనగ, వంగ, చిక్కుడు, బెండ, కంద, పసుపు, అల్లం, పైనాపిల్, చిరుధాన్యలు, ఆకు కూరలు, కాయగూరలు పండిస్తున్నారు. వరి విస్తీర్ణం తగ్గించి చిరు ధాన్యలు, పప్పు ధాన్యలు విస్తీర్ణం పెంచడం, అధిక ధరలకు అమ్మకంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాడానికి వీలుంటుంది.

చిరుధాన్యాలకు పెరిగిన గిరాకీ

ప్రకృతి వ్యవసాయ సాగులో ఎటువంటి రసాయనాలూ లేకుండా గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో తరతరాల నుంచి పండించే చిరుధాన్యాలకి మంచి గిరాకీ ఏర్పడింది. కొండ పోడు వ్యవసాయంలో చోడి,

రసాయన ఎరువులు లేని పంట

ప్రకృతి వ్యవసాయంతో రసాయనిక ఎరువులు లేని పంటలు పండించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలుగా ఉంటుంది. పంటలు పండించే విధానంలో జట్టు సభ్యుల సలహాలు, సూచనలు పాటించడంతో తక్కువ ఖర్చుతో పంటలు వేసుకోవడానికి వీలు కలిగింది. దీంతో ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు..


శీ వరి సాగులో వీడింగ్ చేస్తున్న గిరిజన మహిళా రైతు

కొర్రలు, జొన్నలు, జుడుములు, కందులు, గంటెలు, రాగులు తదితర పంటలు పండిస్తున్నాం. మంచి ఆరోగ్యానికి కొండపోడు పంటలు ఎంతగానో దోహదపడతాయి. కరోనా తర్వాత చిరుధాన్యాలకు బయట మార్కెట్లో బాగా డిమాండ్ పెరిగింది.

పి. వారమ్మ, గిరిజన మహిళ రైతు, చాపరాయి బిన్నిడి గుమ్మలక్ష్మీపురం మండలం

ఖర్చుల భారం తగ్గింది

ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే వేలకు వేలు పెట్టుబడులు పెట్టవలసి వచ్చేది. మాలాంటి పేద రైతులు అప్పులు చేయక తప్పేది కాదు. జట్టు సంస్థ సహకారం వల్ల తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం. వరితో పాటు కూరగాయల పంటలను ఏడాది అంతటా పండిస్తున్నాం.

పి.భాగ్యలక్ష్మి మహిళా రైతు, బుడ్డెంఖర్జ, గుమ్మలక్ష్మీపురం మండలం

ఆదుకోవాలని ఆటో కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత మహిళలకు బస్సు పథకం వల్ల నష్టపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటో రంగా కార్మికులు ధర్నా చేశారు. సిఐటియు, ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడారు. వాహన మిత్ర పథకం కింద ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.30,000 ఇవ్వాలని, జిఒ 21న వెంటనే రద్దు చేసి రవాణా రంగ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రవాణా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో, రవాణా రంగంలో ఉండే కార్మికులు పథకాలు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆటో కార్మికుల సమస్యలపై చర్చించి న్యాయం చేసేలా ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు, వారి కుటుంబాలతో ఆందోళనకు సిద్ధపడతామని దీనికి



మక్కువ: తహశీల్దార్‌కు వినతినిస్తున్న ఆటో కార్మికులు

రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మామిడిపల్లి, శివాజీ బొమ్మ జంక్షన్, కొత్తవలస, మాతుమూరు, పి కొనవలస, ఆర్ బి పురం, ఆటో స్టాండ్ల కమిటీ నాయకులు రమేష్, సోమేశు, శ్రీనివాసరావు, జగ్గా రావు, గుణ్ణం నాయుడు పెద్ద ఎత్తున ఆటో రంగ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు.

పార్వతీపురం టౌన్ : ఆటో యజమానులతో పాటు లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర అమలు చేయాలని డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్, సిఐటియు కోశాధికారి గొర్ల వెంకటరమణ, మండల కన్వీనర్ బి సూరిబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణం, సింహాచలం డిమాండ్ మాట్లాడుతూ వాహన మిత్ర పథకం అమలులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని, ప్రతి ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, రాంబాబు, గౌరీశ్వరరావు, రాజు, రాము, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు గురువారం తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఆటో రంగంలో పనిచేస్తున్న కార్మిక సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని, మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోరంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కృష్ణారావు, ఆటో కార్మిక జెఎసి నాయకులు మామిడి నరేష్, కారణం చిన్న, బొంగు రామ్మూర్తి, భాను, దాలయ్య, వెంకటరమణ, సిహెచ్ రామకృష్ణ, సిహెచ్ వెంకటరమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్ట: ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్, టాటా ఏసీ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జిఒ


వీరఘట్టం: వినతి పత్రాన్ని అందిస్తున్న ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు

నెంబర్ 21ని రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు మాట్లాడుతూ ఆటోలు ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్ నేపథ్యంలో తీవ్రంగా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని జియమ్మ వలస మండల సిఐటియు కార్యదర్శి సంఘం నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులకు క్యాబ్, ఆటో డ్రైవర్లతో కలిసి గురువారం వినతి అందజేశారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే సీతారాం, ఆటో కార్మికులు రవి, పోలిరాజు, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వస్తినారీశక్తి పరివార అభియాన్ ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు పరిశీలించారు. ఈ వైద్యశిబిరాల ద్వారా మహిళల్లో ఉండే రక్తహీనత, పోషక విలువలు, గర్భిణులు అలాగే యువతలకు అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేపడతామన్నారు. అనంతరం వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. కావున ప్రతి మహిళా ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పిహెచ్‌సిని పరిశీలించారు. ఆయనవెంటన డిఐఒ టి.జగన్మోహనరావు, వైద్యాధికారి పి.ఉషారాణి, ఆయుర్వేదిక వైద్యాధికారి టి.హేమాక్షితో పాటు వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: 'స్వస్త నారీ స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో ఈ నెల 22న మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నామని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళల కోసం ఎన్‌సిడి స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్, క్షయవ్యాధి స్క్రీనింగ్, రక్తహీనత స్క్రీనింగ్ చేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భామిని: బత్తిలి పిహెచ్‌సి ప్రాంగణంలో డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, కేన్సర్ వంటి వ్యాధులు, గర్భ సంరక్షణ తనిఖీలు వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. పౌష్టికాహారం, శిశు సంరక్షణపై అవగాహన కలిగించారు. తల్లి శిశువు సంరక్షణ కార్డులు అందజేశారు. ఈ వైద్య శిబిరం ద్వారా 215మందికి వైద్య సేవలు అందించినట్టు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిలి వైద్యులు కొండపల్లి రవీంద్ర, దామోదర్‌రావు, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

299 మందికి వైద్య తనిఖీలు

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం, బిటివాడ ఆరోగ్య కేంద్రాల పరిధిలో చిదిమి, రేగులపాడులో గురువారం ఎస్ఎన్ఎస్‌పిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు బి.ప్రదీప్ కుమార్, పి.గణేష్ గౌతమ్ 299 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, జ్వర పీడితులు, మధుమేహ, రక్త పోటు, కేన్సర్, సికిల్ సెల్ తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఓ శాంత్ కుమారి, సుభాధ్రామని, లలిత కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.


సీతానగరం: శిబిరంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

లారీ ఢీకొని ఎడ్లు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసాపేట సమీపాన లారీ ఢీకొని రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఎం.రాజేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాశయ్యపేట పెట్రోల్ బంకు వద్ద గురువారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటలకు జగ్గునాయుడు పేట నుంచి ఇసుక తీసుకొని వెళ్లడానికి సీతానగరం నుంచి రెండు నాటు బండ్లు వస్తుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ఈ నాటుబళ్లను ఢీకొన్నాడు. దీంతో తిరుపతిరావు నాటు బండి, ఎద్దు, రెండో నాటు బండి అయినా పెంట పోలినాయుడు ఎద్దు సంఘటనా స్థలంలోనే మృతి చెందాయి. ఇదే ప్రమాదంలో రెడ్డి తిరుపతిరావుకు చిన్న చిన్న దెబ్బలు తగలడంతో అతడ్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బిసిల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బిసిల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకెళ్తామని, రాష్ట్ర జనాభాలో సంఖ్యాపరంగా బిసిలు అధికంగా ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి నెడుతున్నాయని, వారి పరిరక్షణకు ఆ సంఘం తరపున నిరంతరం పోరాటం చేస్తామని బిసి సంక్షేమ సంఘం మన్యం జిల్లా అధ్యక్షులు ఆవాల రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం పెన్షన్‌దారుల సమావేశ మందిరంలో సంఘ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 శాతం ఉన్న బిసి జనాభాలో అటు చట్టసభల్లోనూ, ఇటు ప్రభుత్వం విభాగాల్లో 40 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కుతున్నాయని ఇది చాలా అన్యాయమని అన్నారు. పూర్తి శాతం రిజర్వేషన్ల సాధనకు పోరాటం చేస్తామని, బిసిలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు పోరాటం చేస్తామని, సంఘ అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేస్తామని అన్నారు. ఎంతో నమ్మకంతో గురుతర బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్రావుకు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షులు క్రాంతి కుమార్ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. సమావేశంలో బిసి సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ శీరాపు వెంకట మహేష్, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు ముగడ జగన్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలు వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చని గిరిజన ప్రాజెక్ట్ అసోసియేట్ (ఢిల్లీ) దివ్యనంద్ అన్నారు. గురువారం ఆదికర్మా అభయాన్ కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ పర్యటనకు వచ్చిన ఆమె అడ్డంగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలను, తయారు చేసిన కషాయాలు, ద్రావణాలను పరిశీలించారు. రసాయనిక ఎరువులు లేని పంటలను రైతులు పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్టర్ ట్రైనర్ చంద్రమౌళి, ఎంపిడిఒ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్, యూనిట్ ఇంఛార్జి కిమిడి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న పిఎ దివ్యనంద్

కె వెంకటాపురంలో పొలంబడి

సీతానగరం: మండలంలోని కె.వెంకటాపురంలో గురువారం ఎఒ ఎస్.అవినాస్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సూర్యనారాయణ పంతులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎఒ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్స్ టెస్ట్ పెట్టి రైతులకి వరిలో వచ్చే తెగులు, పురుగులు, మిత్రపురుగులు గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. గోపాలకృష్ణ, రైతులు శంకర్రావు, అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

మేజర్ పంచాయతీలోని బాబూ జగజ్జీవనరామ్ కాలనీ, అక్కులపేట, కస్పావీధి వీధుల్లో అధ్వానంగా రహదారులు, కాలువలు దర్శనమిస్తున్నప్పటికీ పాలకవర్గం వీటిపై దృష్టి సారించడం లేదని సిపిఎం మండల నాయకులు ఎం.సింహాచలం విమర్శించారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వృథాగా పడి ఉన్న మరుగుదొడ్లను, కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మరుగుదొడ్లు ఉన్న చోటే కొత్తవి నిర్మించి లక్షలాది రూపాయలు నిధులు వృథా చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల కాలంలో గ్రంథాలయ పక్కన ఉద్యోగుల అవసరాల నిమిత్తం లక్షలాది రూపాయలతో మరుగుదొడ్లు నిర్మించారని, వీటికి కొంత మొత్తాలను పెట్టి బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సి పోయి వాటిని పక్కన పెట్టి మేజర్ పంచాయతీ కార్యాలయం పక్కనే రూ.రెండు లక్షల అంచనా వ్యయంతో కొత్తగా మరుగుదొడ్డి నిర్మించి ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. మేజర్ పంచాయతీలోనే అనేక వీధుల్లో రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉన్నాయని, వీటి మరమ్మతులపై దృష్టి పెట్టకుండా పంచాయతీ


వృథాగా పడి ఉన్న మరుగుదొడ్లను పరిశీలిస్తున్న సింహాచలం

నిధులను కొల్లగొట్టేందుకు ప్రణాళికలు రచించి పనులు చేసి మామ అనిపించి నిధులు దోచుకుంటున్నారని విమర్శించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని బస్టాప్‌లో ఉన్నచోట మరుగుదొడ్లు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలోని అధ్వానంగా ఉన్న కాలువలను, రహదారులను పరిశీలించి అభివృద్ధిపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పచ్చిరొట్ట ఎరువులతో ఆరోగ్యవంతమైన పంటలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

50 ఏళ్ల క్రితం పెంట గత్తం, వేపపిండి, పచ్చి రొట్ట ఎరువులతో ఆరోగ్యవంతమైన పంటలు పండించి సంతోషంగా రైతులు జీవించారని జట్టు ట్రస్ట్ ఆశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారి నాయుడు అన్నారు. గురువారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో జరుగుతున్న బయో ఉత్పత్తుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక వ్యవసాయ విధానం వల్ల కొంతకాలం దిగుబడులు పెరిగినా దీర్ఘకాలంలో దిగుబడులు తగ్గడమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకూడదన్న ఆశయంతో సుస్థిర వ్యవసాయ విధానాలను రైతులకు తెలియజేయడానికి రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో బయో రిసోర్స్ సెంటర్స్ ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో సహజ ఎరువులను, కషాయాలను ఉంచే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నవ ధాన్య విధానాల వల్ల పంటకు అన్ని పోషకాలు అందుతాయని, దీనివల్ల దిగుబడులు పెరగడంతో పాటు అధిక పోషకాలతో కూడిన ఆహారం వినియోగదారులకు అందించగలుగుతామని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత రౌతు వాసుదేవరావు, సినీ గేయ రచయిత తుంబలి శివాజీ, రైతు సాధికార సంస్థ అధికారులు, డి.మన్మోహన్, ప్రవీణ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.